# అవినీతికి చట్టబద్ధత – నీతికి పాతరవేస్తున్న పాలకులు

**మనదేశంలో** అవినీతి, లంచగొండితనం అనంతంగా సాగుతున్నాయనేది బహిరంగమే. మన రాజకీయ వ్యవస్థలోనూ, పాలనా యంత్రాంగంలోనూ పైనుండి క్రిందవరకూ అవినీతి అనే క్యాన్సర్ ఓ భాగమైపోయింది. ఈ సర్వవ్యాపిత అవినీతితో దేశంలోని వ్యవస్థలు, సంస్థలన్నీ ప్రభావితమై వున్నాయి. న్యాయపాలక యంత్రాంగం, న్యాయవ్యవస్థ కూడా అవినీతితో తగినంతగా ప్రభావితమయ్యాయనేందుకు విశ్వసించదగిన ఆధారాలున్నాయి.

బెర్లిన్‌కు చెందిన 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్ నేషనల్' (టిఐ) (అంతర్జాతీయ పారదర్శకత) అనే సంస్థ ఆసియా దేశాలలో అవినీతి ఏ స్థాయిలలో గూడుకట్టుకుని వుందో అధ్యయనం చేసి 2017 సెప్టెంబర్‌లో తన నిర్ధారణలను వెలువరించింది. ఫోర్బ్స్‌జర్నల్‌లో ప్రచురితమైన ఈ నిర్ధారణల ప్రకారం మనదేశంలో అవినీతి మోతాదు వియత్నాం, థాయ్‌లాండ్, పాకిస్తాన్, మయన్మార్ లలో కంటే హెచ్చుగా వుందని పేర్కొంది. పాకిస్థాన్‌లో అవినీతి 40 శాతం వుండగా, భారతదేశంలో అది 69 శాతంగా వుందని 16 దేశాలలో సర్వే జరిపిన టి.ఐ. సంస్థ పేర్కొంది. పాఠశాలలు (విద్యాసంస్థలు), ఆసుపత్రులు (ఆరోగ్యరంగం), పోలీసు, గుర్తింపుపత్రాలు (రెవిన్యూ మొ॥) మొదలైన సేవారంగాలలో అవినీతి సర్వవ్యాపితంగా వుందని ఆ నివేదిక పేర్కొంది.

ప్రజల ఆకాంక్షలకు ద్రోహం చేస్తూ, దేశ వ్యాపితంగా వ్యవస్థ యొక్క ఉన్నత పాలనా, రాజకీయ స్థాయిలలో కొనసాగుతున్న అవినీతి తీవ్రత, గాఢతలను వివిధ పరిశోధనలు వెల్లడి చేస్తున్నాయి.

వాస్తవికంగా ఏ ప్రజాస్వామిక ప్రభుత్వానికి, పాలకులకైనా అవినీతి నిర్మూలన తక్షణ, ప్రప్రథమ అవిశ్రాంత కర్తవ్యంగా వుండి తీరాలి.

అయితే, వాస్తవానికి మన వ్యవస్థలో మన దేశ పాలకులు, పాలకవర్గాలు గత 70 సం॥ల స్వతంత్రంగా చెప్పబడేవారి పాలనను 'ప్రజల యొక్క ప్రజలకొరకు, ప్రజలచేత' పాలనగా ఎంతగా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, అవినీతి గురించి వరుసగా అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలన్నీ అవినీతిని అంతం చేస్తామనే గొప్ప గొప్ప వాగ్దానాలు చేయటం మినహా ఆచరణలో ఆ దిశగా చర్యలేమీ చేపట్టకుండానో లేక కంటి తుడుపు చర్యలకో పరిమితమవటం అనేది మన అనుభవంలోనిదే. మరోవైపున అవినీతిని నిరోధించే ఎలాంటి చర్యలనైనా నీరుగార్చి, తూట్లుపొడిచేందుకు పాలకులు తమ రాజకీయ చతురతను, పార్లమెంటరీ శక్తిని ఉపయోగిస్తున్నారు.

సెప్టెంబర్‌లో హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సందర్భంగా పెద్దనోట్లరద్దుకు వ్యతిరేకంగా వచ్చిన విమర్శలను తిప్పికొడుతూ; అక్టోబర్, నవంబర్‌లలో గుజరాత్ రాష్ట్ర ఎన్నికల సందర్భంగా, అవినీతి వ్యతిరేక యుద్ధం సాగిస్తున్న పోరాట యోధునిగా తనను తాను చూపెట్టుకుంటూ, అందుకోసం రాజకీయ మూల్యం చెల్లించేందుకు సంసిద్ధంగావలసివస్తే కూడా సిద్ధమై వున్నా నంటూ పెద్ద గొంతుతో ప్రధాని నరేంద్రమోడీ ఎన్నికల ప్రసంగాలు చేశాడనేది నిస్సందేహం. కానీ వాస్తవాచరణలో ఆయన వాగాడంబరమంతా అక్కడి ఓటర్లను, మొత్తంగా ప్రజలను మోసగిం చేందుకేననేది స్పష్టం.

రాజస్థాన్ రాష్ట్రంలో వసుంధరరాజె సింధియా ప్రభుత్వం 2017 సెప్టెంబర్ 6న ఒక ఆర్డినెన్స్ జారీ చేసింది. దానినే తర్వాత శాసనసభలో 'క్రిమినల్ లాస్ (నేర చట్టాలు) (రాజస్థాన్ సవరణ)' పేరుతో చట్టంగా చేశారు. న్యాయమూర్తులను, ప్రభుత్వాధికారులను – వారిపై వచ్చిన అవినీతి ఆరోపణలు అబద్ధమని నిరూపించుకోవాల్సిన అవసరాన్నుండి ఈ చట్టం కాపాడుతుంది. ఈ చట్టం అధికారవర్గమంతటికీ తగినతం బలాన్ని సమకూర్చి, అవినీతి ఆరోపణల కేసుల గురించి స్వేచ్ఛగా వార్తలు ప్రచురించేందుకు వీల్లేకుండా ఇది ప్రసారమాధ్యమాలపై ఆంక్షలు విధిస్తోంది. ప్రభుత్వాధికారి ఎవరైనా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నప్పటికీ, బహిరంగంగా అతని పేరు బయటికొచ్చిన ఆరు నెలల కాలంవరకు లేదా రాష్ట్ర ప్రభుత్వం దానిపై విచారణకు ఆదేశించేవరకు ఈ చట్టం రక్షణ కల్పిస్తుంది. ముఖ్యమంత్రి, క్యాబినెట్ మంత్రు లతోసహా ఐఏఎస్ అధికార్ల స్థాయిలో అవినీతికి సంబంధించి నిర్దిష్ట ఆధారాలున్నప్పటికీ చట్ట భీతిలేని కవచంగా ఈ చట్టం రక్షణ కల్పిస్తుంది. నేర శిక్షాస్మృతి (సిపిసి), భారతీయ శిక్షాస్మృతిలకు (ఐపిసి) సవరణలు చేస్తూ ఈ బిల్లును రూపొందించారు. ఈ చట్టాన్ని 'ధిక్కరించి' ప్రభుత్వాధికారుల అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టాలని డిమాండ్‌చేసే వారిని అరెస్టుచేసే అధికారాన్ని ఈ చట్టం కల్పిస్తోంది. జాతీయ వనరులను లూటీ చేసుకెళ్ళటానికి సామ్రాజ్య వాదులకు దన్నుగానున్న రాజకీయ నేతలకు విధేయులుగా వుండే అవినీతి అధికారులను చట్టబద్ధంగా కాపాడటానికి ఈ చట్టం ఉద్దేశించ బడింది. ఉన్నతాధికారులకు, ఎంఎల్ఏలకు, ఎంపీలకు, మంత్రులకు, అవినీతి, తప్పుడు పనుల ఆరోపణలెదుర్కొనే ఇతరులకు ఈ బిల్లు చట్టపరమైన భద్రతా కవచాన్ని కల్పిస్తోంది. ఒక అవినీతి అధికారిపై జరిగే కనీస ప్రాథమిక దర్యాప్తును సైతం ఈ బిల్లు ప్రతిభావంతంగా నిరోధించగల్గుతుంది. ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా దర్యాప్తుకు ఆదేశించే అవకాశం లేకుండా ఈ ప్రభుత్వాదేశం / బిల్లు న్యాయమూర్తులను నిరోధిస్తుంది. సిఆర్‌పిసి సెక్షన్ 197, అవినీతి నిరోధకచట్టం – 1988లోని సెక్షన్ 19లతో ఇప్పటికే రక్షణ పొందుతున్న ప్రభుత్వాధికారులకు ఇది అదనపు రక్షణ కవచంగా తోడ్పడుతుంది.

స్వతంత్ర దర్యాప్తును ఈ ఆర్డినెన్స్ / బిల్లు నిరోధించి, వాస్తవం వెలికిరాకుండా నిరోధిస్తుంది. అవినీతి అధికారులను ముందస్తుగా హెచ్చరించి అప్రమత్తం చేయటం ద్వారా, వారు తమ ఆధారాలను కప్పెట్టటానికి అవకాశమిస్తుంది. తాము భద్రంగా ఉండేందుకు; ఆరోపణలు రుజువుకాకుండా తప్పించుకోవటానికి; ఆరోపణలు చేసినవారిని ప్రభావితం చేయటానికి లేదా వారిపై బెదిరింపులకు పాల్పడేందుకు అవకాశం కల్పిస్తోంది.

మహారాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే తరహా బిల్లును న్యాయస్థానంలో సమర్థిస్తూ వస్తోంది. అవినీతి నిరోధక చట్టానికి సవరణ ద్వారా ముందస్తు అనుమతిని పునరుద్ధరించాలని కోరుతూ పార్లమెంట్‌లో 2013 నుండి ఇదే తరహా బిల్లు – పెండింగ్‌లో వుంది.

చట్టం ముందు అందరూ సమానులేనని మనకు ప్రబోధిస్తూ వుంటారు. అయితే సామాన్య ప్రజానీకంతోపాటు చట్టం ముందు అందరూ సమానులే అనేదానికన్నా 'స్వతంత్ర' న్యాయ వ్యవస్థ తనకు తాను అధిక ప్రాముఖ్యత కలిగినదిగా పరిగణించుకుంటున్నట్లుగా కనపడుతోంది. ఇటీవలే, ఒడిషాకు చెందిన మాజీ హైకోర్టు న్యాయమూర్తి అవినీతి ఆరోపణల కేసును ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి బదలాయించినపుడు, సాంకేతిక భూమికపై "ఎవరికేసు ఏ న్యాయమూర్తి వద్దకో నిర్ణయించే" తన అధికారాన్ని ప్రధాన న్యాయమూర్తి ఉపయోగించుకున్నాడు. ఈ దృక్పథమే – వాస్తవికంగా అవినీతి వ్యతిరేక పోరాటమనేది మన వ్యవస్థలో ఎంత డొల్లగా వుందనేదాన్ని గురించి ఎంతో చెబుతోంది.

ప్రజాస్వామ్యం పేరిట, ప్రజాస్వామ్య మూల స్థంభాల్లో ఒకటిగా గొప్పలు చెప్పుకుంటూనే న్యాయవ్యవస్థ సాగించే మోసకారీతనం, చట్టాన్ని అమలుపరచటంలో ఆడే నాటకం – నిరంత రాయంగా ప్రదర్శించబడుతూనే వుంది. అవినీతి మూలాలు ఈ దోపిడీవ్యవస్థతో ముడిపడి వుండి, అవినీతి – మోసకారీతనమనే విత్తనాలతో పెంపొందించటం కారణంగా, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అవినీతిని అంతంచేసి పూర్తిగా తుడిచిపెట్టటం చేయలేరు; చేయరనేది స్పష్టం.

సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ నయా ఉదారవాద ఆర్థిక విధానాలు ప్రపంచాన్ని పాలిస్తున్న ఈ కాలంలో, ప్రభుత్వాలను కేవలం లాభార్జనా పాలనా వ్యాపారంగా కుదిస్తున్న ఈ రోజుల్లో, పార్లమెంటు మరియు వివిధ రాష్ట్రాల శాసనసభలు ప్రజల హక్కులకు ప్రమాదకరంగా పరిణమించిన ఈ విధమైన మరిన్ని ప్రజా వ్యతిరేక విధానాలను, చట్టాలను పకడ్బందీగా చేస్తున్నాయి. పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క వర్గస్వభావమే ఈవిధంగా వుంటుంది.

ఈ తరహా తిరోగమన, క్రూరమైన చట్టాలను ఆమోదించటం రాజస్థాన్ ప్రభుత్వానికి ఇదేమీ మొదటిసారి కాదని గుర్తించటం ముఖ్యమైన విషయం. బ్రిటిష్ వలసపాలన కాలంనాటి క్రూరమైన దోపిడీ అణచివేతలను కొనసాగించే విధంగా, కార్మికవర్గ ప్రయోజనాలకు విరుద్ధంగా కార్మికచట్టాలను సవరించి తిరోగమన దిశలో ఆ కాలానికి నెట్టివేయడంలో రాజస్థాన్ ప్రభుత్వం ముందు నిలిచింది.

మనదేశ పాలకుల – ప్రత్యేకించి ప్రస్తుత బిజెపి పాలకుల ప్రజా వ్యతిరేక, ప్రతీఘాతుక దృక్పథాన్ని ఈ అంశాలు వెల్లడి చేస్తున్నాయి. రాజస్థాన్ ప్రభుత్వం చేసిన ఈ చట్టాన్ని 'నిఖార్సైనది, సమతుల్యమైనది'గా కేంద్ర ప్రభుత్వంలోని ఓ మంత్రి మెచ్చుకోలు ప్రకటన దీనిని మరింత స్పష్టం చేస్తోంది.

మనదేశ పాలకులు, పాలకవర్గాలు సాగిస్తున్న బరితెగించిన ఈ వంచనను, మోసకారీతనాన్ని శక్తివంతంగా ప్రజలముందు వెల్లడి చేయటంతో పాటు, పాలకుల ప్రజాస్వామ్య వ్యతిరేక, ప్రజా వ్యతిరేక వర్గస్వభావాన్ని ఎరుకపరిచి, సమీకరించే బాధ్యత దేశభక్తియుత, ప్రజాస్వామిక శక్తులదే.

oooooo